బిజినేపల్లి, ఏప్రిల్ 8 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వట్టెం గ్రామంలో ట్రాక్టర్ కింద పడి ఉపాధి కూలీకి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కిష్టమ్మ సోమవారం గ్రామ శివారులోని పెద్ద చెరువులో ఉపాధి హామీ పనిలో భాగంగా నల్లమట్టి తీసే పనికి వెళ్లింది. పనుల అనంతరం తిరిగి ఇంటికి వెళ్లేందుకు గాను ట్రాక్టర్ ఎక్కి కూర్చున్నది. ప్రమాదవశాత్తు కింద పడడంతో ట్రాక్టర్ ఆమె కాలు పైనుంచి పోయింది. దీంతో ఆమె కాలు విరిగింది. ఆమెతో పాటు ఉన్న మిగతా ముగ్గురు కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. కిష్టమ్మను తోటి కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్ రాజశేఖర్‌లు వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించి కాలుకు కట్టు కట్టించారు. ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగిందని బాధితులు వాపోతున్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితురాలి బంధువులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చారకొండ, ఏప్రిల్ 8 : నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని గోకారం చెరువు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని ఎర్రవల్లితండాకు చెందిన నేనావత్ రాంపాల్ నాయక్ తన ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా సోమవారం తెల్లవారుజామున పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అమరచింతలో అర్ధరాత్రి దొంగల హల్‌చల్

» పాల దుకాణంలో రూ.60 వేల నగదు చోరీ



అమరచింతలోని పాల దుకాణం షట్టర్‌ను ఇనుప రాడ్లతో పెకిలించిన దృశ్యం

అమరచింత, ఏప్రిల్ 8 : వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రంలో వారం రోజులుగా దొంగలు హల్‌చల్ సృష్టిస్తున్నారు. తాజాగా ఆదివారం రాత్రి ప్రధాన రహదారిలో ఉన్న కేజేఎస్ కోడిగుడ్లు, పాల దుకాణంలో దొంగలు షాప్ షట్టర్‌ను ఇనుప రాడ్లతో పెకిలించి కౌంటర్‌లో ఉన్న రూ.60వేల నగదును చోరీ చేశారు. తెల్లవారుజామున పాల వ్యాన్ కోసం ఎప్పటిలా షాప్ యజమాని ఖాజా దుకాణానికి రాగా అప్పటికే షట్టర్ తీసి ఉండడంతో నగదు చోరీ అయినట్లు నిర్ధారించారు. విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అంతేగాక గతవారం ప్రధాన రహదారిపై ఉన్న ఓ మెడికల్ షాపు, ల్యాబ్ షాపులను రాడ్లతో పెకిలించే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. రెండురోజుల క్రితం మునిసిపాలిటీ కేంద్రంలోని ఎనిమిదో వార్డులో ఓ బైక్‌ను అపహరించేందుకు కూడా యత్నించారు.

చిత్తనూర్ ఇథనాల్‌తో పర్యావరణ విధ్వంసం

» పాలసీని తెచ్చిన బీజేపీ, బీఆర్ఎస్‌ను నిలదీద్దాం
» ఈ పాలసీపై కాంగ్రెస్ వైఖరి ఏంటో చెప్పాలి
» 18న హైదరాబాద్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం
» చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ



కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

పాలమూరు, ఏప్రిల్ 8 : పర్యావరణ విధ్వంసానికి కారణమవుతున్న చిత్తనూర్ ఇథనాల్ కంపెనీని తక్షణమే రద్దు చేయాలని చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ప్రతినిధి బృందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం జిల్లా కేంద్రంలోని టీఎఫ్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఇథనాల్ పాలసీని తీసుకువచ్చిన బీజేపీ, బలపరిచిన బీఆర్ఎస్ పార్టీల నాయకులు పార్లమెంట్ ఎన్నికల ఓట్ల కోసం వస్తే నిలదీయాలని పిలుపునిచ్చారు. ఇథనాల్ పాలసీపై కాంగ్రెస్ పార్టీ తమ వైఖరి ఏంటో బయటపెట్టాలన్నారు. 18వ తేదీన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సుమారు మూడేళ్లుగా చిత్తనూర్, ఎక్లాస్‌పూర్, జిన్నారం గ్రామాల నడుమ ఏర్పాటు చేసిన చిత్తనూర్ ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా పోరాడుతున్నామని పేర్కొన్నారు. జూరాల ఆర్గానిక్ ఫార్మ్స్ అండ్ ఆగ్రో ఇండస్ట్రీస్ వారు పండ్ల రసాల ఉత్పత్తి పేరుతో చవకగా, తేరగా భూములు కొనుగోలు చేసి పండ్ల తోటలు కాకుండా ఇథనాల్ ఉత్పత్తి కంపెనీ ఏర్పాటుకు పూనుకోవడంతో మనం నిరంతరం పోరాటంలో ఉన్నామని తెలిపారు. ప్రజల జీవించే హక్కు, రక్షణ, పర్యావరణ పరిరక్షణ, స్థానిక వనరుల దురాక్రమణ, నివారణ లక్ష్యాలతో మన జీవితాల బాగుకోసం పోరాడుతున్నామని వివరించారు. కంపెనీ యాజమాన్యం స్థానిక ప్రజలకు, రెవెన్యూ, అటవీ, పర్యావరణ, కాలుష్య నియంత్రణ, పోలీసు, న్యాయ తదితర శాఖలకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అబద్ధాల మీద అబద్ధాలు చెప్పిందన్నారు. నిజానిజాలను పరిశీలించాల్సిన అన్ని శాఖలు, ప్రభుత్వం కంపెనీకి లోబడి పనిచేశాయన్నారు. శాంతియుతంగా పోరాటం చేస్తున్న మనమీద అణచివేత, నిర్బంధం, కేసులు, రౌడీషీట్లు ప్రయోగించటం దారుణమన్నారు. 22 అక్టోబర్ 2023న జరిగిన అక్రమ లాఠీచార్జిపై జ్యుడీషియల్ విచారణ జరిపి కారకులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న 20 ఇథనాల్ కంపెనీలను ఎత్తివేయాలన్నారు. అదేవిధంగా, చిత్తనూర్, ఎక్లాస్‌పూరు, జిన్నారం, కన్మనూర్ తదితర గ్రామాల రైతాంగంపై, ఉద్యమ నాయకత్వంపై బనాయించిన అక్రమ కేసులను, రౌడీషీట్‌ను ఎత్తివేయాలన్నారు. చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ దురాక్రమణలో ఉన్న నక్షబాటలను విడుదల చేయాలన్నారు. సమావేశంలో పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం.రాఘవాచారి, టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ఖలీల్, చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కోకన్వీనర్ శ్రీదేవి, కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు బండారి నరసప్ప, ఏఐఎస్ఎఫ్ నాయకులు బీసమొల్ల నాగరాజు, రైతు ఉచ్చిల్ల రామచంద్రయ్య, కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి నాయకుడు బండారి లక్ష్మయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలకే గ్యారెంటీ లేదు

» దేశ భవిష్యత్ కోసం బీజేపీని ఆదరించాలి
» పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

గద్వాల, ఏప్రిల్ 8 : 'రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలకే గ్యారెంటీ లేదు.. ఇప్పుడు రాహుల్‌గాంధీ వచ్చి దేశంలో ప్రభుత్వం ఏర్పాటుచేస్తే ఐదు గ్యారెంటీలను అమలు చేస్తామంటున్నారు. కాంగ్రెస్ గెలిచేది లేదు... గ్యారెంటీలు అమలు చేసేది లేదని' బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. సోమవారం డీకే బంగ్లాలో ఆమె పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్ పార్టీకి ఓట్లు అడిగే హక్కు లేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు గ్యారెంటీల పేరు చెప్పి మోసం చేశారని, ఇప్పుడు ఐదు గ్యారెంటీల పేరుతో మోసం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. దేశం కోసం, దేశ భవిష్యత్ కోసం వికసిత భారత్ లక్ష్యంగా ముందుకు వెళ్తున్న నరేంద్రమోదీని ఆశీర్వదించాలని ఆమె కోరారు. ప్రతీ కార్యకర్త బీజేపీ గెలుపు కోసం కష్టపడాలని ఆమె సూచించారు. సమావేశంలో వనపర్తి జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యంగారి ప్రభాకర్, విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పనిచేసే వారిని ప్రజలే కాపాడుకుంటారు

» జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బ్రహ్మారెడ్డి

వనపర్తి వైద్యవిభాగం, ఏప్రిల్ 8 : ప్రతీ వైద్యుడిని, పీఎంపీ, ఆర్ఎంపీని కాపాడేది జనమేనని, ప్రజల కోసం పనిచేసే వారిని ప్రజలే కాపాడుకుంటారని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో మహాదేవ చారిటబుల్ ట్రస్ట్ ఉరుమల్ల విశ్వం ఆధ్వర్యంలో ఆర్ఎంపీ, పీఎంపీల వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్‌తో కలిసి ఆయన హాజరై, మాట్లాడారు. వైద్యం చేయడమే వైద్యుల పని కాదని, రోగాలకు గురి కాకుండా ప్రజలను చైతన్యం చేయడం కూడా వైద్యంతో సమానమన్నారు. గ్రామీణ వైద్యుడంటే గ్రామాల్లోని వందమందితో సన్నిహితంగా మెలిగే ఒక నేస్తమని పాలకులు గుర్తించాలన్నారు. డబ్బులు సంపాదించాలంటే వైద్య వృత్తిని ఎంచుకోవడంతో సమాజం కలుషితమవుతోందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్ మాట్లాడుతూ సహజ సిద్ధమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని, స్త్రీలు శారీరక శ్రమను తగ్గించుకోవడం వల్ల అధిక సంఖ్యలో ఆపరేషన్లు అవుతున్నాయని అన్నారు. మొదటగా ఆర్ఎంపీలు, పీఎంపీలు మారి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ మురళీధర్, మహాదేవ ఛారిటబుల్ ట్రస్ట్ ఉరుమల్ల విశ్వం, డాక్టర్ సదన్, డాక్టర్ సిద్ధార్థ, కవి జనజ్వాల, సత్తార్, గంధం నాగరాజు, ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్, ప్రధాన కార్యదర్శి చిన్నడ్యానియల్, పట్టణ అధ్యక్షుడు గంధం ప్రసాద్, స్వామినాయుడు, కృపాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో వ్యక్తి రిమాండ్

» వివరాలు వెల్లడించిన ఎస్పీ యోగేష్‌గౌతమ్



విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న మాట్లాడుతున్న ఎస్పీ యోగేష్‌గౌతమ్

నారాయణపేటటౌన్, ఏప్రిల్ 8 : నారాయణపేట జిల్లా కేంద్రంలో ఈనెల ఐదో తేదీన ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ యోగేష్‌గౌతమ్ హత్య కేసు వివరాలను వెల్లడించారు. జిల్లా కేంద్రంలో ఈనెల ఐదో తేదీన అర్ధరాత్రి సమయంలో జిల్లా ఆసుపత్రి వెనుకాల గోవధశాల వద్ద ఓ వ్యక్తిని రాయితో కొట్టి హత్య చేసి నిప్పంటించారు. పోలీసులు మృతదేహాన్ని గుర్తించి అతడి సోదరుడు దాసరి నారాయణకు సమాచారమందించగా అతను ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహం తన తమ్ముడు మారుతిగా గుర్తించారు. నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామన్నారు. డీఎస్పీ లింగయ్య ఆధ్వర్యంలో సీఐ శివశంకర్, ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బందితో నిందితుడిని పట్టుకొని విచారించామన్నారు. పట్టణానికి చెందిన నజీర్ అలియాస్ ఉప్పరి నర్సింహులు హత్యకు పాల్పడినట్లు విచారణలో తేలింది. మృతుడు మారుతి, ఉప్పరి నర్సింహులుకు మద్యం విషయంలో గొడవ జరిగింది. ఆ గొడవ హత్యకు దారి తీసినట్లు ఎస్పీ తెలిపారు. దాసరి మారుతిని రాయితో కొట్టి చంపిన తరువాత నిందితుడు నర్సింహులు చొక్కాపై రక్తపు మరకలు పడడంతో దానిని మృతదేహంపై పారేసి నిప్పంటించాడు. నిందితుడు నర్సింహులుకు తల్లిదండ్రులు, తోబుట్టువులు ఎవరూ లేరు. చిన్నతనంలోనే తండ్రి మరణించగా కొద్దికాలం క్రితం తల్లి కూడా మరణించింది. దాంతో నర్సింహులు జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేసి జైలుకు కూడా వెళ్లి వచ్చాడు. ఇతడిపై నారాయణపేట పోలీస్‌స్టేషన్‌లో సస్పెక్టెడ్ షీడ్ కూడా ఉందన్నారు. కేసును ఛేదించడంలో కృషి చేసిన సీఐ శివశంకర్, ఎస్సై వెంకటేశ్వర్లు, పోలీసులు ఆంజనేయులు, రాములును ఎస్పీ అభినందించారు. అనంతరం వారికి రివార్డులను అందించారు. కార్యక్రమంలో డీఎస్పీ లింగయ్య ఉన్నారు.

వాహనాల తనిఖీ ముమ్మరం

» పట్టుబడుతున్న నగదు



చారకొండలో పట్టుకున్న నగదుతో ఎస్సై రాజశేఖర్

చారకొండ/ఊర్కొండ/వెల్దండ/గద్వాల క్రైం/గోపాల్‌పేట/దామరగిద్ద/కృష్ణ, ఏప్రిల్ 8 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో భాగంగా పోలీసులు వాహనాల తనిఖీని ముమ్మరం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటుచేసిన అంతర్‌జిల్లా చెక్‌పోస్టు వద్ద ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. చారకొండలోని కస్తూర్బాగాంధీ పాఠశాల వద్ద డీసీఎంలో రూ.2,32,400 నగదు పట్టుబడిందని ఎస్సై తెలిపారు. నల్గొండ జిల్లా మాల్ నుంచి డిండికి వెళ్తున్న పాల కృష్ణ వద్ద డబ్బులు పట్టుబడినట్లు చెప్పారు. పట్టుకున్న నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు అతని వద్ద లేకపోవడంతో డబ్బును జిల్లా గ్రీవెన్స్ కమిటీకి పంపించినట్లు ఎస్సై పేర్కొన్నారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్స్ శ్రీనివాసులు, శ్రీశైలం, కానిస్టేబుల్స్ భాస్కరచారి, మల్లేష్, జంగయ్య ఉన్నారు. అదేవిధంగా, ఊర్కొండ మండలం కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై ముచ్చర్లపల్లి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్ట్ వద్ద సోమవారం రూ.1,71,440 నగదును పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎసై వీరబాబు తెలిపారు. తనిఖీలో ఏఎస్సై ఇస్మాయిల్, కానిస్టేబుల్ ఉన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిపై సోమవారం సాయంత్రం పోలీసులు చేపట్టిన వాహనాల తనిఖీలో ఓ వ్యక్తి నుంచి రూ.మూడు లక్షల 80 వేలు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ఎస్సై రవి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా మహబూబ్‌నగర్‌కు చెందిన తుల్జారాంజీ అనే వ్యక్తి తన కారులో రూ.3 లక్షల 80 వేలు ఉన్నట్లు గుర్తించారు. నగదుకు సంబంధించి ఆధారాలు లేకపోవడంతో నగదును జిల్లా గ్రీవెన్స్‌కు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

జోగుళాంబ గద్వాల జిల్లా కేటీ దొడ్డి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నందిన్నె చెక్‌పోస్టు వద్ద పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీలో రూ.2 లక్షల 21 వేల నగదు పట్టుబడింది. తనిఖీల్లో భాగంగా ఓ వాహనంలో ఎలాంటి రశీదు లేని రూ.1.48 వేలు, మరో వాహనంలో రూ.73 వేలు గుర్తించి సీజ్ చేసినట్లు ఎస్పీ రితిరాజ్ సోమవారం తెలిపారు. నగదును జిల్లా ఎన్నికల గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు చెప్పారు. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం బుద్దారం గ్రామ పరిధిలోని గండి ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఏర్పాటుచేసిన జిల్లా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద రూ.64 వేలు పట్టుబడినట్లు ఎస్సై హరిప్రసాద్ తెలిపారు. బిజినేపల్లి మండలం శానాయిపల్లి గ్రామానికి చెందిన శివయ్య తన కారులో రూ.64 వేల నగదును వనపర్తికి తీసుకెళ్తుండగా చెక్‌పోస్టు వద్ద పోలీసులు కారు ఆపి తనిఖీలు నిర్వహించారు. శివయ్య వద్దనున్న నగదుకు సంబంధించి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం కానుకుర్తి చెక్‌పోస్టు వద్ద రూ.ఒక లక్షా ఎనిమిది వేలు, కృష్ణ మండలం కృష్ణ బ్రిడ్జి చెక్‌పోస్టు వద్ద రూ.56 వేల నగదు పట్టుకున్నట్లు ఎస్పీ యోగేష్‌గౌతమ్ తెలిపారు. పట్టుబడిన నగదును గ్రీవెన్స్ కమిటీకి పంపించినట్లు ఆయన చెప్పారు.

శ్రీశైలం ఘాట్ రోడ్డులో ట్రాఫిక్‌జామ్

» ఇబ్బంది పడిన ప్రయాణికులు



ఎడమ పాతాళగంగ వద్ద ట్రాఫిక్‌జామ్‌తో నిలిచిపోయిన వాహనాలు

దోమలపెంట, ఏప్రిల్ 8 : శ్రీశైలం ఘాట్ రోడ్డు ఆంధ్ర - తెలంగాణ సరిహద్దులో సోమవారం వాహనాల రాకపోకలతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మంగళవారం ఉగాది పండుగ నేపథ్యంలో కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు శ్రీశైలం మల్లన్న దర్శనం కోసం వాహనాల్లో తరలివస్తున్నారు. సోమవారం ఉదయం శ్రీశైలం - హైదరాబాద్ నుంచి వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో ఎడమ పాతాళ గంగ నుంచి సున్నిపెంట వరకు ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఘాట్‌లో రోడ్డు ఇరుకుగా ఉండటం.. వాహనాలు అధిక మొత్తంలో రావడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడి దాదాపు మూడు గంటల పాటు ప్రయాణికులు, శ్రీశైలం వెళ్లే భక్తులు ఇబ్బంది పడ్డారు. వాహనాలు ఇంకా వచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా దోమలపెంట, పాతాళ గంగ, వటువర్లపల్లి, ఈగలపెంట గ్రామాల్లో వాహనాలు నిలుపకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు ఈగలపెంట ఎస్సై వీరమల్లు పేర్కొన్నారు.

నల్లమల అడవుల్లో చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు

» దోమలపెంట ఎఫ్‌ఆర్‌వో గురుప్రసాద్

దోమలపెంట, ఏప్రిల్ 8 : నల్లమల అటవీ ప్రాంతం అమ్రాబాద్ అభయారణ్యంలో చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని దోమలపెంట ఎఫ్‌ఆర్‌వో గురుప్రసాద్ హెచ్చరించారు. సోమవారం వటువర్లపల్లి బేస్ క్యాంపులో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. నల్లమల అడవుల్లో ఉద్దేశపూర్వకంగా మంటలు పెట్టినా, జంతువులను వేటాడినా, చెట్లను నరికినా, జంతువుల ఆవాసాల్లో సంచరించినా, అటవీశాఖ నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేకుండా వాహనాలు అడవుల్లోకి వెళ్లినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అంతేకాకుండా అటవీ ఉత్పత్తుల సేకరణకు వెళ్లేవారు, పశువులు, గొర్రెలు, మేకల కాపర్లు అటవీ ప్రాంతంలో మంటలు పెట్టడం, చెట్లను నరకడం వంటి చర్యలకు పాల్పడితే కేసులు పెట్టడంతో పాటు, జరిమానా కూడా విధిస్తామని అన్నారు. అడవుల రక్షణ మనందరి బాధ్యతగా భావించాలని ఎఫ్‌ఆర్‌వో పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్‌వో ఖాజామైనోద్దీన్, ఎఫ్ఎస్‌వో శివకుమార్, ఎఫ్‌బీవోలు ముత్యాలు, నర్సింహ, సిబ్బంది ఉన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



లక్ష్మయ్య (ఫైల్)

తెలకపల్లి, ఏప్రిల్ 8 : కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం గౌరారం గ్రామంలో చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బిరుదు లక్ష్మయ్య(45) కుటుంబ కలహాల నేపథ్యంలో ఆదివారం రాత్రి 10:30 గంటల సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన తల్లి గ్రామస్థుల సహాయంతో కుమారుడిని నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి కుమారుడు రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ఉరి వేసుకొని మరొకరు..



అల్లాజీగౌడ్ (ఫైల్)

చారకొండ, ఏప్రిల్ 8 : ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం గోకారం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాదగోని అల్లాజీగౌడ్(47) తాగుడుకు బానిసై కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. క్షణికావేశంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య మల్లమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య మల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గుంటి మడుగులో పడి వ్యక్తి మృతి

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 8 : నీళ్లు తాగేందుకు వెళ్లి మడుగులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం దేవినేనిపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ కుర్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. దేవినేనిపల్లి గ్రామానికి చెందిన దాదిమల్ల కుర్మయ్య(60) గ్రామ శివారులోని గుంటి మడుగులో నీళ్లు తాగేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి మడుగులో పడి ఊపిరాడక మృతి చెందాడు. మృతుని భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

లారీ డ్రైవర్‌కు జరిమానా



లారీ టైర్ కింద నలిగిపోయిన మొక్కలు

వడ్డేపల్లి, ఏప్రిల్ 8 : నిర్లక్ష్యంగా వాహనం నడిపి హరితహారం మొక్కలను నాశనం చేసిన ఓ లారీ డ్రైవర్‌కు మునిసిపల్ అధికారులు జరిమానా విధించారు. జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి పురపాలక సంఘం పరిధిలోని శాంతినగర్ మెయిన్‌రోడ్డు పక్కన నాటిన హరితహారం మొక్కలను లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడిపి వాటిపైకి ఎక్కించడంతో అవి నేలపాలయ్యాయి. సమాచారమందుకున్న మునిసిపల్ అధికారులు కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం లారీ డ్రైవర్‌కు రూ.రెండు వేలు జరిమానా విధించారు. వాహనదారులు తమ వాహనాలను నిర్లక్ష్యంగా నడిపి మొక్కలను నాశనం చేస్తే జరిమానా తప్పదని మునిసిపల్ కమిషనర్ హెచ్చరించారు.

కురుమూర్తివాసా.. గోవిందా.. గోవింద

» అమావాస్యతో కిటకిటలాడిన గిరులు



కురుమూర్తిరాయుడిని దర్శించుకుంటున్న భక్తులు

చిన్నచింతకుంట, ఏప్రిల్ 8: మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపురం గ్రామ సమీపంలోని కురుమూర్తి వేంకటేశ్వర స్వామి వారి క్షేత్రం సోమవారం అమావాస్య సందర్భంగా గోవింద నామస్మరణతో మారుమోగింది. తెల్లవారుజామునే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించున్నారు. జాతర మైదానం అంతా గోవిందా.. గోవిందా.. కురుమూర్తివాసా గోవిందా అంటూ పరవశించిపోయింది. పవిత్ర స్నానాలు ఆచరించిన భక్తులు స్వామి వారికి తమ మొక్కులను తీర్చుకున్నారు.

తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి

▸ అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలి : ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి శ్రుతి ఓఝా


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి శ్రుతి ఓఝా

గద్వాల న్యూటౌన్, ఏప్రిల్ 8 : జిల్లాలో తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ సెక్రటరీ, ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి శ్రుతి ఓఝా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీవోలతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా జనవాసాలకు ప్రతీరోజు తాగునీరు సరఫరా అయ్యేలా అధికారులు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో బోరు మోటర్లు, ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మండల స్థాయి అధికారులందరూ గ్రామ పంచా యతీ కార్యదర్శులను సంప్రదిస్తూ తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఉన్నట్లు పత్రికల్లో వార్తలు వస్తే, అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో నీటి లభ్యత, తాగునీటి డిమాండ్, సరఫరా తదితర వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పైప్ లైన్ లీకేజీలు ఎక్కడా ఉండొద్దని, ప్రభుత్వ బోర్లు, చేతిపంపులను మరమతు చేయించారా అని ఆరా తీశారు. ఓవర్ హెడ్ ట్యాంకులపై సరైన మూతలు ఉండాలని, నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. కలెక్టర్ బీఎం సంతోష్ మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాకు సమస్య లేదని, జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలు, 255 గ్రామ పంచాయితీలకు అవసరం మేరకు సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే స్పందించి గ్రామపంచాయతీ నిధులతో బోరు మోటార్లు, చేతి పంపులు, ఇతర తాగునీటి వనరులకు మరమతు పనులు చేపడుతున్నట్లు చెప్పారు. సమావేశంలో ఆదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్, మిషన్ భగీరథ ఎస్ఈ జగన్‌మోహన్, ఇంట్రా, గ్రిడ్ ఈఈలు శ్రీధర్ రెడ్డి, భీమేశ్వరావు, డీఆర్డీవో నర్సింగరావు, జిల్లా పంచాయితీ అధికారి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

▸ కలెక్టర్ బీఎం సంతోష్ ▸ అధికారులతో సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, హాజరైన ఎస్పీ

గద్వాల న్యూటౌన్, ఏప్రిల్ 8 : జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను సమర్థవంతంగా అరికట్టాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పాటు ఎస్పీ రితిరాజ్ పాల్గొన్నారు. జిల్లాలోని ఇసుక రీచ్‌లకు సంబంధించిన సమస్యలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు సమన్వయంతో ఇసుక సమస్యలను పరిష్కరించాలన్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండలాల వారీగా సీసీ కెమెరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాల నిఘా మధ్య వాహనాలను తనిఖీ చేయాలని, అక్రమ తవ్వకాలపై నిఘా పెంచాలని ఆదేశించారు. ఎక్కడ ఇసుక అక్రమ రవాణా జరిగినా తహసీల్దార్లు, ఎస్ఐలు వెంటనే స్పందించి ఆరికట్టాలన్నారు. ప్రతీ రోజు పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు వాహనాలను తనిఖీ చేయాలని, అక్రమంగా ఇసుక తరలించే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ పరిధిలో పట్టుకున్న వాహనాలకు తప్పనిసరిగా జరిమానా విధించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రామ్‌చందర్, అడిషనల్ ఎస్పీ గుణశేఖర్, డీఎస్పీ సత్యనారాయణ, మైనింగ్ ఏడీ బీవీ రమణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన కల్పించాలి

▸ అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ ▸ కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్

గద్వాల న్యూటౌన్, ఏప్రిల్ 8 : వడదెబ్బకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ వైద్యసిబ్బందిని ఆదేశించారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన కరపత్రాలను సోమవారం సాయంత్రం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో వైద్యాధికారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు, ఇతర సిబ్బంది ఇంటింటికీ తిరిగి ప్రజలకు కరపత్రాలను ఇవ్వాలని సూచించారు. ఓఆర్ఎస్, ప్యాకెట్లు, ఇతర అవసరమైన మందుల కొరత లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ గుణశేఖర్, డీఎంహెచ్‌వో డాక్టర్ శశికళ, డీఆర్డీవో నర్సింగరావు, ఆర్డీవో రాంచందర్, డీపీవో వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

సార్వత్రిక ఎస్ఎస్‌సీ, ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 25 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నందున జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్వాలలో మొత్తం ఐదు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ గుణశేఖర్, డీఎస్పీ సత్యనారాయణ, ఆర్డీవో రామ్‌చందర్, ఇంటర్ నోడల్ అధికారి హృదయరాజు, ఇన్‌చార్జి డీఈవో ఇందిర, డీఎంహెచ్‌వో డాక్టర్ శశికళ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు

▸ ఆంజనేయస్వామి ఆలయాల్లో అభిషేకాలు ఆకుపూజలు


డి-బూడిదపాడు ఆంజనేయ స్వామి ఆలయంలో పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

గద్వాల టౌన్/ గట్టు/ ఇటిక్యాల/ ఎర్రవల్లి/ మానవపాడు/ ఉండవల్లి/ వడ్డేపల్లి/ రాజోలి/ అయిజ/ మల్దకల్/ ధరూరు/ కేటీదొడ్డి, ఏప్రిల్ 8 : ఫాల్గుణ బహుళ అమా వాస్యను పురస్కరించుకుని సోమవారం జిల్లా వ్యాప్తం గా ఉన్న ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గద్వాల పట్టణంలోని రాజ య్యతోట, వేదనగర్, అడవేశ్వర ఆలయాల్లో స్వామి వారికి పంచామృతాభిషేకం, రాతిబురుజు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద భక్తులు ఆకు పూజలు నిర్వహించారు. పిల్లిగుండ్ల కాలనీ అభయాంజనేయ ఆలయం, కోటలోని సోమనాద్రినగర్ ఆంజనేయ స్వామి ఆలయం, గుంటి చెన్నకేశవస్వామి ఆలయం, పెద్ద అగ్రహారం లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. రెండవ రైల్వే గేటు అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. కృష్ణానది రోడ్డులోని ఆంజనే యస్వామి ఆలయం వద్ద భక్తులు ద్విచక్రవాహనాలు, కార్లు, ట్రాన్స్‌పోర్టు వాహ నాలకు పూజలు చేయించారు.

- గట్టు మండల పరిధిలోని మాచర్ల లక్ష్మీ చెన్నకేశ స్వామి, గట్టులోని గండి హనుమప్ప స్వామి, బల్గెరలోని దిగంబర స్వామి ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. మాచర్ల చెన్నకేశవస్వామి ఆలయంతో మాచర్ల గ్రామానికి చెందిన సస్యశ్రీ, భాస్కర్ దంపతులు భక్తులకు అన్న దానం చేశారు.

- ఇటిక్యాల మండల కేంద్రంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి అభిషేకం చేశారు. గ్రామానికి చెందిన బుచ్చిరెడ్డి కుమారులు శివకుమార్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డిల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. మండలంలోని పెద్దదిన్నె గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో అమావాస్య పూజలు చేశారు.

- ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి అంజనేయ స్వామి అలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఈవో రామన్‌గౌడ్, ప్రధాన అర్చకుడు మారుతి పాల్గొన్నారు.

- మానవపాడు మండలం, అమరవాయి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో కుంకుమార్చన, ఆకుపూజ చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం తేజగౌడ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

- ఉండవల్లి మండల పరిధిలోని డి-బూడిదపాడు ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం ఉదయం తులసీదళాలతో అర్చన, ఆకు పూజ చేశారు. మధ్యాహ్నం సీతా రామలక్ష్మణ, ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తులను పల్లకీలో ఊరేగించారు. బుక్కాపురం గ్రామానికి చెందిన గుంజపల్లి నరసింహారెడ్డి జ్ఞాప కార్థం వారి కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.

- వడ్డేపల్లి మండల పరిధిలోని కలుకుంట్లలో కొలువుదీరిన పిల్లిగుండ్ల ఆంజనేయస్వామికి ఉదయం ఆకుపూజ, అభిషేకం, రుద్రహోమం చేశారు.

- రాజోలి మండల కేంద్రంలోని వైకుంఠ నారాయణ స్వామి సన్నిధిలోని ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి బిందెసేవ, అభిషేకం చేసి, స్వామిని సింధూరంతో అలంకరించారు. తుంగభద్ర నది మధ్యనున్న కొలువుదీరిన రామేశ్వర స్వామికి అభిషేకం చేశారు. కార్యక్రమంలో అర్చకుడు అడివి స్వామి, బీమన్న, ఎర్రన్న, శివ పాల్గొన్నారు.


అమరవాయిలో ఆకు పూజ సందర్భంగా ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

- అయిజ పట్టణంలోని తిక్కవీరేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు.

- ఆదిశిలా క్షేత్రంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అమావాస్య పూజలు చేశారు. ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈవో సత్యశ్చంద్రారెడ్డి భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. రాయిచూరు జిల్లా గదారం గ్రామానికి చెందిన గట్టు ఈరన్న దంపతులు భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. శాంతినగర్ శివశివాని టెక్నోస్కూల్ ఆధ్వర్యంలో రాత్రి అన్నదానం చేశారు.

- ధరూరు మండల పరిధిలోని పెద్దచింతరేవుల ఆంజనేయ స్వామి ఆలయంలో ఆకుపూజ చేశారు.

- కేటీదొడ్డి మండలంలోని వెంకటాపురం గ్రామంలోని పాగుంట లక్ష్మీ వెంకటేశ్వరస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. గద్వాలకు చెందిన రమ్య ఇండ్రస్టీస్ అధినేత బండ్ల రాజశేఖర్‌రెడ్డి 100 కేజీల పెరుగు అందించారు.


బీచుపల్లిలోని ఆంజనేయ స్వామి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు


పిల్లిగుండ్ల ఆంజనేయస్వామి ఆలయంలో భజన చేస్తున్న భక్తులు


ఇటిక్యాల శివాలయంలో అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించేలా చర్యలు

▸ 'ప్రజావాణి'లో ఎస్పీ రితిరాజ్


ఫిర్యాదుదారుతో మాట్లాడుతున్న ఎస్పీ రితిరాజ్

గద్వాల క్రైం, ఏప్రిల్ 8 : ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా కృషి చేస్తామని ఎస్పీ రితిరాజ్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె పలువురు బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఆస్తి పంపకాలు, పొలం బాట, అక్రమంగా భూమి రిజిస్ట్రేషన్, ప్రేమ పెళ్లి చేసుకున్న తమకు పోలీస్ భద్రత కావాలని, భార్యభర్తల మధ్య గొడవకు సంబంధించిన ఫిర్యాదులున్నాయి. వాటిపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బాధితులకు హామీ ఇచ్చారు. వచ్చిన ఫిర్యాదులను ఆయా పోలీస్ స్టేషన్లకు పంపించి వెంటనే పరిష్కరించేలా చూడాలని సీఐ, ఎస్ఐలను ఆదేశించారు.

నేటి నుంచి దస్తగిరయ్య ఉత్సవాలు


ఉత్సావాలకు ముస్తాబైన దస్తగిరయ్య దర్గా

రాజోలి, ఏప్రిల్ 8 : మండలంలోని పచ్చర్ల గ్రామంలో దస్తగిరయ్య ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉగాది పండుగ నుంచి మూడు రోజుల పాటు మాజీ సర్పంచు తిరుమల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. దర్గాకు రంగులు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. మంగళవారం ఉదయం దర్గాలో ప్రత్యేక పూజలు చేయనున్నారు. సాయంత్రం గుర్రంపై గంధం ఊరేగింపు నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం ఉర్సు ప్రారంభం కానున్నది. గురువారం సాయంత్రం ఐదు గంటలకు కిస్తి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించనున్నారు.

సత్యామాంబ కల్యాణోత్సవాలు ప్రారంభం


పందిరి పూజకు పుట్టమన్ను తెస్తున్న గ్రామస్థులు

అయిజ, ఏప్రిల్ 8 : మండల పరిధిలోని చిన్నతాండ్రపాడు గ్రామంలో సత్యమాంబ (పార్వతి) కల్యాణోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం భక్తులు బాజా భజంత్రీలో ఊరేగింపుగా వెళ్లి పుట్టమన్ను తెచ్చి, ఆలయం ముందు ముత్యాల పందిరి వేశారు. బాజా భజంత్రీలతో భక్తులు పుట్ట మన్ను తీసుకువచ్చి ఆలయం ముందు ముత్యాల పందిరి వేశారు. సాయంత్రం ప్రభోత్సవం నిర్వహించారు. మంగళవారం ఉదయం 9.25 గంటలకు కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. సాయంత్రం పులికల్ గ్రామానికి చెందిన చిన్నారులు కోలాట ప్రదర్శన ఇవ్వనున్నారు. 10వ తేదీన సాయంత్రం మడు గంటలకు అంతర్రాష్ట్రస్థాయి సందరాళ్ల ఎత్తు పోటీలు, 11న గ్రామస్థాయిలో ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహించనున్నారు. అదే రోజు రాత్రి జానపద, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

తాగు నీటి ఎద్దడిని పరిష్కరించాలి

▸ ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద

గట్టు, ఏప్రిల్ 8 : మండల కేంద్రంలోని ఏడవ వార్డు పరిధిలోని చాకలి వీధిలో తాగునీటి ఎద్దడిని పరిష్కరించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద కోరారు. సోమవారం ఆమె కాలనీవాసులతో కలిసి గ్రామ పంచాయతీ కార్యదర్శి శివశంకర్‌కు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఐద్వా బృందం గ్రామంలో పర్యటించినప్పుడు ఆ వీధి ప్రజలను నీటి సమస్యను తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. నాలుగు రోజులకొకసారి అరగంట మాత్రమే నీరు సరఫరా అవుతోందని తెలిపారన్నారు. కొన్ని నెలలుగా ఈ సమస్య ఉన్నా, ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని, లేకపోతే ఐద్వా ఆధ్వర్యంలో కార్యాలయాలను ముట్టడి స్తామని హెచ్చరించారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు


బోర్ల మరమ్మతుకు గ్రామాలకు తరలిస్తున్న మోటార్లు, పైపులు

మానవపాడు, ఏప్రిల్ 8 : మండలంలోని గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సోమవారం మండల కేంద్రం నుంచి రెండు మోటర్లు పల్లెపాడు, కలుకుంట్ల గ్రామాలకు పంపించారు. బోర్లకు మోటార్లు బిగించి, నీటిని ట్యాంకుల్లో నింపి, అక్కడి నుంచి ఇళ్లకు సరఫరా చేయనున్నట్లు ఏఈ రాఘవేంద్ర తెలిపారు. ఇతర గ్రామాల్లోని బోర్లకు కూడా త్వరలో మోటార్లను బిగించనున్నట్లు చెప్పారు.

ఉదయం 11 గంటల వరకు ఇళ్లకు చేరాలి

మానవపాడు, ఏప్రిల్ 8 : రోజురోజుకు ఉష్ణోగ్రత పెరుగుతుండటంతో పనుల మీద బయటకు వెళ్లిన వారు, 11 గంటల వరకు ఇళ్లకు చేరుకోవాలని డాక్టర్ రిజ్వానా ప్రజలకు సూచించారు. ఉపాధి హామీ, పొలం పనులకు వెళ్లిన వారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నీరు, పళ్ల రసాలు, కొబ్బరినీళ్లు అధికంగా తాగాలని చెప్పారు. వడదెబ్బ తగిలిన వారికి లీటర్ నీటిలో పిడికేడు చెక్కెర, చిటికెడు ఉప్పు వేసి తాగించి, ఆరోగ్య కేంద్రానికి తీసుకురావాలని కోరారు.

ఇన్‌చార్జి డీఎస్‌వోగా విమల


ఇన్‌చార్జి డీఎస్‌వో విమల

గద్వాల న్యూటౌన్, ఏప్రిల్ 8 : పౌరసరఫరా శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారిగా విమల సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఎస్‌వోగా విధులు నిర్వహిస్తున్న రేవతి మార్చి 31న పదవీ విరమణ చేశారు. ఆమె స్థానంలో జిల్లా పౌరసరఫరా శాఖ డీఎం (జిల్లా మేనేజర్)గా ఉన్న విమలకు ఇన్‌చార్జి డీఎస్‌వోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ రైస్ సకాలంలో ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల వెల్లువ

గద్వాల న్యూటౌన్, ఏప్రిల్ 8 : జిల్లాలో నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వ వైద్యకళాశాలలో అవుట్ సోర్సింగ్ పోస్టులకై దరఖాస్తులను ఆహ్వానించిన విషయం తెలిసిందే. సోమవారం నుంచి ఈ నెల 18 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. వివిధ క్యాటగిరిలకు సంబంధించిన 24 పోస్టులకు గాను తొలిరోజే 229 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు.

'అంబేడ్కర్ అలోచన పండుగను విజయవంతం చేయాలి'

గట్టు, ఏప్రిల్ 8 : గద్వాల పట్టణంలో ఈనెల 12న నిర్వహించనున్న అంబేడ్కర్ ఆలోచన పండుగను విజయవంతం చేయాలని అల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బుడకల ప్రకాష్ కోరారు. గట్టు, కేటీదొడ్డి మండలాల్లో సోమవారం వారు అంబేడ్కర్ ఆలోచన పండుగ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి ర్యాలీ ప్రారంభం అవుతుందని తెలిపారు. కేఎస్ ఈవెంట్ హాల్‌లో సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి దళిత, బహుజనలు, ప్రజా సంఘాలు, ఉద్యోగులు, అంబేడ్కర్ వాదులు రాజకీయ నాయకులు హాజరు కావాలని కోరారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానం మార్పు

మల్దకల్, ఏప్రిల్ 8 : మండలంలోని సద్దలోనిపల్లి గ్రామంలోని శ్రీకృష్ణస్వామి ఆలయ సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను భక్తుల కోరిక మేరకు వేరే ప్రాంతంలోకి మార్చారు. ఆలయ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండటం వల్ల ప్రమాదాలు జరుగుతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఆలయ చైర్మన్ రామకృష్ణ, మురళీకృష్ణ, మాజీసర్పంచు అశోక్‌ల ఆధ్వర్యంలో విద్యుత్ ఏఈ దుర్గప్రసాద్ అనుమతితో ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి, మరో ప్రదేశంలో ఏర్పాటు చేశారు.

మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

గద్వాల టౌన్, ఏప్రిల్ 8 : యూపీఎస్సీ (సీఎస్ఏటీ-2025) పరీక్షకు హాజరయ్యే వంద మంది మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ఎంప్రసాదరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటిసారి ప్రవేశం పొందే అభ్యర్థులు ఏప్రిల్ 22వ తేదీ లోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆప్టిట్యూడ్ టెస్టులో ప్రవేశం కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో డిగ్రీ పూర్తి చేసిన మైనార్టీ అభ్యర్థులు (ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైన్, బుద్దిస్ట్, పార్శీలు) అర్హులని తెలిపారు. ప్రవేశ పరీక్ష ఈనెల 28న జిల్లా కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థుల ఎంపిక ఉంటుందని తెలిపారు. మహిళలకు 33.33 శాతం, వికలాంగులకు ఐదు శాతం సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు పంచాంగ శ్రవణం

అలంపూర్, ఏప్రిల్ 8 : ఉగాది పర్వదినం సందర్భంగా ఐదవ శక్తి పీఠం అలంపూర్‌లోని జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం పంచాంగ శ్రవణం ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో పురందర్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు ఆలయ ఉప ప్రధాన అర్చకుడు డి.ఆనంద్‌శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

జిల్లా సదస్సును జయప్రదం చేయాలి

▸ సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజు

అలంపూర్, ఏప్రిల్ 8 : జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవన్‌లో ఈనెల 13న నిర్వహించనున్న వామపక్షాల జిల్లా సదస్సును జయప్రదం చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు రాజు, మండల కార్యదర్శి రాజు అన్నారు. పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలను ఏడు విడతలుగా కాకుండా, ఒకే విడతలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. మరోసారి అధికారంలోకి రావడానికే ఏడు విడతలుగా ఎన్నికలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నరసింహా, ఆశన్న, మాలిక్‌బాషా, రఫీ పాల్గొన్నారు.